సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్‌–23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు మంగళవారం డ్రాగా ముగిశాయి. - 12లో



ఈ గురుకులం మాకొద్దు నాన్నా..

లక్కిరెడ్డిపల్లె గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ పరిమళ భర్త లైంగిక వేధింపుల పర్వం నేపథ్యంలో విద్యార్థినులు పాఠశాల వీడి ఇంటికి వెళ్తున్నారు. -12లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.300
రెండోరకం	రూ.140	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 204 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

విశ్వకర్మ పథకం ద్వారా రుణాలు

రాయచోటి టౌన్: విశ్వకర్మ పథకం ద్వారా ప్రభుత్వం రుణాలు అందిస్తుందని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం అన్నమయ్య జిల్లా కార్యనిర్వాహక సంచాలకుడు ఎస్.జయసింహ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకాన్ని గత సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీ ప్రారంభించారన్నారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకళాకారులు, చర్మకారులు, తాపీ పని వారు, బొమ్మల తయారీ దారులు, బుట్టలు/చాపలు/చీపుర్లు, బొమ్మల తయారీ దారులు, సంప్రదాయ క్షురకులు, దుస్తులు ఉతికేవారు, దీర్జీలు ఇలా అన్ని రకాల వారు అర్హులని తెలిపారు. వారి వృత్తులలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. ఆసక్తి గలవారు https:llpmvishwakarma.gov.in వెబ్‌సైట్ లేదా సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాలు, లేదా గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



చెకుముకి టాలెంట్ టెస్టు పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి అర్బన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన జనవిజ్ఞానవేదిక నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టు -2024 పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ పోటీ పరీక్షలలో పాల్గొనేలా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబరు 25న పాఠ శాల స్థాయిలో, అక్టోబరు 1న మండల స్థాయిలో, 27న జిల్లా స్థాయిలో, నవంబరు 9,10 తేదీలలో రాష్ట్రస్థాయిలో పోటీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయం ఏడీ ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి ఓబుల రెడ్డి, డైట్ అధ్యాపకుడు వై.సి.రెడ్డెప్పరెడ్డి, జేవీవీ జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, రవీంద్ర నాథరెడ్డి, శివారెడ్డి, రామయ్య, ప్రధానోపాధ్యాయుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఉత్తమ సేవలు



ఎక్కువ కేఎంపీయల్ తెచ్చిన డ్రైవర్లను అభినందిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

రాయచోటి అర్బన్: ప్రయాణికులకు మరింతగా ఉత్తమ సేవలు అందించేందుకు ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలని ఆర్టీసీ కడప జోన్–4 ఈడీ టి. చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన రాయచోటి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ బస్సులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా బస్సు సర్వీసులను నడపడం ద్వారా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వీలైనంతవరకు ఎక్కువ కేఎంపీల్ వచ్చేలా చూడాలన్నారు. కేఎంపీయల్ ఎక్కువగా తీసుకువచ్చిన డ్రైవర్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం గ్యారేజిని పరిశీలించి అక్కడి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. అన్నమయ్య జిల్లా డీపీటీఓ రాము మాట్లాడుతూ డిపోకు బీఎస్–4 బస్సులు వచ్చినందున వాటిని నడిపేలా డ్రైవర్లకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ధనుంజయ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం రోజుకు రూ. 6.50 కోట్లు

పీలేరురూరల్: కడప జోన్–4 పరిధిలో మొత్తం 52 డిపోల్లో ఆర్టీసీ ఆదాయం రోజుకు రూ. 6.50 కోట్లు వస్తోందని ఆర్టీసీ ఈడీ టి. చెంగల్ రెడ్డి అన్నారు. మంగళవారం పీలేరు, కలకడ ఆర్టీసీ బస్టాండ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప జోన్–4 పరిధిలో రోజుకు 4,415 బస్సు సర్వీసులు 15.67 లక్షల కిలోమీటర్లు తిప్పుతూ రోజుకు రూ. 6.50 కోట్ల ఆదాయం సాధిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ, కార్గో ఆదాయం పెంచేందుకు మరింత కృషి చేస్తామని తెలిపారు. పీలేరు, కలకడ ఆర్టీసీ బస్టాండులలో మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంను ఆదేశించారు. డీఎం కుమార్, బస్ స్టేషన్ మేనేజర్ బాబునాయక్ పాల్గొన్నారు.

వలస జీవితం.. వేదనా భరితం!

- రెండున్నర నెలలుగా ఇసుక సరఫరా బంద్
- భవన నిర్మాణ పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలు
- అప్పులు కూడా దొరకక అర్థాకలితో అలమటిస్తున్న వలస జీవులు



రాజంపేట పట్టణంలో పనుల కోసం మారుతి లాడ్జి సర్కిల్‌లో వేచి ఉన్న కూలీలు

రాజంపేట టౌన్: రాజంపేట ప్రాంతంలోని అనేక మంది కొన్ని దశాబ్దాలుగా కువైట్‌కు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. కువైట్ కారణంగానే చాలా మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడి ధనవంతులు అవుతున్నారంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. కువైట్ వల్లే ఈ ప్రాంతంలో అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. కువైట్‌కు వెళ్లిన వారు స్థిర నివాసం, ఆస్తులను పెంచుకోవడం కోసం స్థలాలను కొనుగోలు చేయడం, పెద్దపెద్ద భవనాలను నిర్మించుకుంటుండటం వల్ల రాజంపేటను ఆంధ్రా కువైట్ అని కూడా పిలుస్తుంటారు. మూడు నెలల క్రితం వరకు భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్న కారణంగా కర్నూలు, కర్ణాటక ప్రాంతాల నుంచి కూలీలు ఇక్కడికి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. దాదాపు రెండు వేల మందికి పైగా వలస కూలీలు, అలాగే పదిహేను వందల మందికి పైగా స్థానికంగా ఉన్న కూలీలు భవన నిర్మాణాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక సరఫరా నిలిచిపోవడంతో భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో పనులు లేక కూలీలు పూటగడుపుకోవడం కోసం అష్టకష్టాలు

భవన నిర్మాణ రంగానికి సంబంధించి పనిచేసే కార్మికుల వివరాలు

కూలీలు (స్థానికులు) :	1500
కూలీలు (వలస వచ్చిన వారు):	2000
ఎలక్ట్రిక్, ప్లంబింగ్ పనులు చేసేవారు:	800
కార్పెంటరీ పనులు చేసే వారు:	400
పెయింటింగ్ పనులు చేసే వారు:	600

పడుతున్నారు. సొంతూరిలో పనులు లేక కడుపు చేత పట్టుకొని వచ్చిన కూలీలకు ఇక్కడ కూడా పనులు లేకపోవడంతో జానెడు పొట్టను నింపుకునేందుకు వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఊరుకాని ఊరు కావడంతో అప్పులు కూడా ఇచ్చేవారు లేక కొంత మంది అర్థాకలితో అలమటిస్తున్నారు.

ఒక్క భవన నిర్మాణ కూలీలకే కాదు..

భవన నిర్మాణ రంగం ఆగిపోతే ఆ ప్రభావం ఒక్క భవన నిర్మాణ కూలీలపైనే కాక అనేక మందిపై పడుతుంది. భవన నిర్మాణాల వల్ల ఎలక్ట్రీషియన్‌లు, కార్పెంటర్‌లు, ప్లంబర్‌లు, పెయింటర్‌లకు ఉపాధి లభిస్తుంది. అయితే ఇసుక లేని కారణంగా భవన నిర్మాణాలు ఆగిపోవడంతో వివిధ రంగాల కార్మికులకు పనులు లేక కుటుంబాన్ని పోషించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మరికొన్ని రోజులు ఇసుక కష్టాలు ఇదే విధంగా ఉంటే దినసరి కూలీలు, వివిధ రంగాల కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతుంది.

జగన్ హయాంలో కూలీలకు స్వర్ణయుగం

వైఎస్ జగన్ సర్కార్ కూలీలకు స్వర్ణయుగంలా ఉండేది. మందరం (కించనాపురం) క్వారీ నుంచి భవన నిర్మాణ యజమానులకు కావాల్సినంత ఇసుక సరఫరా అయ్యేది. ఇసుక కొరత లేకపోవడంతో నిత్యం భవన నిర్మాణ పనులతో పాటు వివిధ పనులు జోరుగా సాగేవి. అందువల్ల నిత్యం వేలాది మంది కూలీలకు పని ఉండేది. భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగిన కారణంగా ఆ రోజుల్లో కొంత మంది భవన నిర్మాణ యజమానులకు ఒక్కోసారి దినసరి కూలీలు దొరక్క పనులను కూడా నిలిపివేసుకునేవారు. అత్యవసరంగా భవన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి అనుకునేవారు కూలీలను పంపించమని మేస్త్రీలను బతిమలాడిన రోజులు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక సరఫరా నిలిచిపోవడంతో కూలీలు మారుతిలాడ్జి సర్కిల్, రైల్వేస్టేషన్ ఏరియాల వద్దకు వచ్చి ఎవరు పనికి పిలుస్తారా అని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కనీసం వారానికి ఒక్కరోజు పని దొరికినా మిగిలిన రోజులు అర్థాకలితో అయినా బతుకు బండిని లాగిస్తామని కూలీలు చెబుతుండటం అత్యంత బాధాకరమైన విషయం.

ఆత్మహత్యలే శరణ్యం




రెండున్నర నెలల నుంచి ఇసుక లేక పోవడంతో పనులు దొరకడం లేదు. పూటగడుపుకోవడం సానా కట్టంగా ఉంది. కరోనాలో ఎవరో ఒకరు ఇంత బువ్వ పెట్టేవాళ్లు. అప్పుడు కూడా ఇంత బాధ అనిపించలేదు. ఇప్పుడు మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది సామి. ఇట్టే ఉంటే ఆకలి బాధలను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుంది. –జడప్ప, భవన నిర్మాణ కూలీ, బళ్లారి, కర్ణాటక రాష్ట్రం

ఎట్టా బతకాలి



ఒకరోజు కాదు రెండు రోజులు కాదు పనులు లేక మూడు నెలలు కావస్తుంది. కూలి పనిచేసుకుంటేనే మేము జానెడు పొట్టను నింపుకోగలం. పనుల కోసం ఊరుకాని ఊరువచ్చాం. ఈడ ఇసుక లేక పనులు నిలిచిపోయాయి. మేము ఎట్టా బతకాలి. మాబోటి పేదోళ్ల కోసమైనా పెబుత్వం ఇసుక వదలాలి. –లక్ష్మీ, భవన నిర్మాణ కూలీ, కర్నూలు జిల్లా

మా మొర ఆలకించే నాథుడే లేడు



పనులు లేక మేము పడుతున్న ఇబ్బందులు దేవుడు ఆలకిస్తున్నాడు. మా బాధలను సబ్‌కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నాము. అయితే మా మొరను ఆలకించే నాథుడే లేడు. పూటగడిచినన్ని రోజులు గడుపుకుందాము, గడవనిరోజు పస్తులుండి బతికితే బతుకుతాం లేకుంటే లేదు అన్న నిర్ణయానికి వచ్చాము. –గాలి చంద్రయ్య, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాజంపేట

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, సబ్‌కలెక్టర్ వైఖోమ్‌నైదియాదేవి

రాజంపేట: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమష్టి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సబ్ కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో డీవీఎంసీ(డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు పెండింగ్‌లో ఉంటే వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ స్టేషన్లలో పెండింగ్‌లో ఎస్సీ, ఎస్టీ కేసులు ఉంటే వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు పురోగతి గురించి తెలుసుకోవడానికి డీవీఎంసీ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీఎస్టీలకు సంబంధించి కేసుల విషయంలో ఎలాంటి అన్యాయం జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాజంపేట డీఎస్పీ సుధాకర్, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, దాసరిపెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

కడప కల్చరల్: కడప పెద్ద దర్గాలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఉరుసు నిర్వహించనున్నారు. హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్టివుల్ ఖాద్రి సాహెబ్ పేరిట నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా 4వ తేదీ గంధం, 5న ఉరుసు, 6న తహలీల్ పాతెహా నిర్వహిస్తారు.

పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న వేదపండితులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామాలయంలో మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు వీణా మనోజ్ కుమార్ చార్యులు మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్‌ల సమక్షంలో పూజలు జరిగాయి. రంగమండపంలో సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా దాశరథి సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సూపరింటెండెంట్ హనుమంతయ్య మాట్లాడుతూ బుధ, గురు, శుక్రవారం మూడు రోజులపాటు రామయ్య క్షేత్రంలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగింపు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడితే సంబంధిత వ్యక్తులను ఉద్యోగం నుంచి తొలగిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల సమస్యలు తెలియజేసేందుకు పాఠశాలలు, వసతి గృహాలలో తప్పకుండా ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలన్నారు.

సొమ్ము సర్కారుది.. పెత్తనం టీడీపీది


- 15వ ఆర్థిక సంఘం నిధుల్లో టీడీపీ నాయకుల పెత్తనం
- జుట్టు పీక్కుంటున్న సర్పంచులు, కార్యదర్శులు



సాక్షి టాస్క్‌ఫోర్స్: తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు టీడీపీ నాయకుల ఆదేశాలతో దిక్కుతోచని స్థితిలో జుట్టు పీక్కుంటున్నారు. గ్రామ పంచాయతీల్లో ఏం పని చేయాలన్నా, ఎలాంటి బిల్లులు పెట్టుకోవాలన్నా టీడీపీ నియోజకవర్గ స్థాయి నాయకుడికి తెలియకుండా చేయరాదని ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు హుకుం జారీ చేస్తున్నారు. అన్ని గ్రామ పంచాయతీలకు ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడంతో నియోజకవర్గ ముఖ్య నేత వారి అనుచరుల చేత ఇలా ఫోన్లు చేయిస్తున్నారని సమాచారం. గ్రామ పంచాయతీలకు నిధులు వచ్చాయి కదా, మీ పంచాయతీకి ఎన్ని నిధులు వచ్చాయి, మీరు ఒకసారి నియోజకవర్గ నాయకుడిని కలిసి ఆయన సూచనల మేరకు పనులు చేసుకోండని తమకు ఫోన్లు వస్తున్నాయని పలువురు సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదిలా ఉండగా తాము ఎన్నికల్లో లక్షల్లో డబ్బు ఖర్చు పెట్టుకుని టీడీపీ తరపున గెలిచామని ఇప్పుడు అధికారంలో ఉన్నా కూడా తమకు కూడా ఇలా ఫోన్లు రావడం ఏంటని కూటమి నాయకుల ధోరణిపై అధికార పార్టీ సర్పంచులే విస్తుపోతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కూడా అప్పటి ఎమ్మెల్యే టీడీపీ సర్పంచులుగా ఉన్న గ్రామ పంచాయతీలపై ఏనాడూ ఎలాంటి పెత్తనం చెలాయించలేదని ఇంకా గ్రామాల అభివృద్ధికే సహకరించారని టీడీపీ సర్పంచులు కొనియాడుతున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే బాగుండేదని, ఇప్పుడు అధికారంలో ఉండి కూడా ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు టీడీపీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక వైఎస్సార్‌సీపీ సర్పంచులుగా కొనసాగుతున్న గ్రామ పంచాయతీలకు సంబంధించి కార్యదర్శులు, ఈఓఆర్డీ, ఎంపీడీఓలకు కూడా తమ నాయకుడు చెప్పినట్లే మీరంతా నడుచుకోవాలని ప్రధానంగా బిల్లులు పెట్టేటప్పుడు కచ్చితంగా తమ నాయకుడి కనుసన్నల్లోనే జరగాలని టీడీపీకి చెందిన పలువురు చోటా నాయకులు ఫోన్లలో ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇదేం తలనొప్పిరా అంటూ అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

బతుకు పూలబాట కాదు!

- పూల ధరలు భారీగా పతనం
- మార్కెట్లో కిలో రూ.15
- వర్షాలతో పుంజుకోని పూలధరలు
- వినాయకచవితిపై ఆశలు పెట్టుకున్న రైతులు



చెరువుమొరవపల్లెలో సాగు చేసిన బంతిపూల తోటలు

గుర్రంకొండ : పూల ధరలు మార్కెట్లో భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధరలు రూ.15 పడిపోయాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో మార్కెట్లో పూల ధరలు పుంజుకోకపోవడంతో రైతులు నష్టపోయారు. రోజురోజుకు పూల ధరలు తగ్గిపోతుండడంతో రానున్న వినాయక చవితి పండుగ సమయంలోనైనా పూలధరలు పుంజుకుంటాయనే ఆశతో రైతులు ఉన్నారు.

1048 ఎకరాల్లో పూల సాగు

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 1048 ఎకరాల్లో బంతి పూలతోటల సాగు చేపట్టారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో తోటలు అదునుకొచ్చి పూల దిగుబడి ప్రారంభమైంది. ఎకరం పూలతోట సాగు చేయాలంటే రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. పూలనారు కొనుగోలు నుంచి పూలు కోతకొచ్చేవరకు రైతులకు ఈ పాటి ఖర్చు వస్తుంది. మార్కెట్లో కనీసం కిలో పూల ధర రూ.30 నుంచి 50లోపు ఉంటే రైతుకు పెట్టుబడి ఖర్చు అయినా చేతికొస్తుంది.

వారం రోజులుగా పతనమైన ధరలు

వారం రోజులుగా మార్కెట్లో పూల ధరలు పతనమయ్యాయి. పదిహేను రోజుల కిందట మార్కెట్లో కిలో పూలధర రూ. 70 నుంచి రూ.85 వరకు పలికింది. అనంతరం పరిణామాలతో బంతిపూల ధరలు మార్కెట్లో రోజురోజుకు తగ్గిపోయాయి. ప్రస్తుతం పూలధరలు కిలో రూ.15 వరకు పలుకుతుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. గతంలో ఇదే సీజన్‌లో కిలో పూల ధరలు రూ. 60 వరకు ధరలు పలికాయి. అదే ఆశతో రెండు నెలలుగా పూలతోటల పెంపకం చేపట్టిన రైతులకు నిరాశే మిగిలింది.

వినాయకచవితి పండగపై ఆశలు

ప్రస్తుతం బంతిపూల రైతులు రానున్న వినాయక చవితి పండుగ పైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం పూల ధరలు పతనమవడంతో వ్యాపారులు పూల కొనుగోలుపై పెద్ద ఆసక్తి చూపించడంలేదు. ఇదే సీజన్‌లో తోటల వద్దకు వచ్చి పూలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించిన వ్యాపారులు ప్రస్తుతం పూలకొనుగోలు వైపు మొగ్గుచూపడం లేదు. జిల్లాలో సాగు చేసే పూలను మదనపల్లె, కడప, తిరుపతి, బెంగళూరు, చెన్నై లాంటి పట్టణాలకు తరలిస్తుంటారు. ఇటీవల పూల బస్తాలతో బెంగళూరు మార్కెట్‌కు వెళ్లిన రైతులకు కనీసం పూలను వ్యాపారులు కొనుగోలు చేయని పరిస్థితి ఎదురైంది. దీంతో రైతులు వినాయక చవితి పండుగ సీజన్‌లో గిట్టుబాటు ధరలు లభిస్తాయనే ఆశతో ఉన్నారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా పూల సాగు, మార్కెట్లో పూల ధరల వివరాలు

నియోజకవర్గం	పూలసాగు (ఎకరాల్లో)	తేదీ	పూలధర (కిలో.రూలలో)
పీలేరు	325	జూన్ 15	రూ. 45
మదనపల్లె	245	జులై01	రూ.40
తంబళ్లపల్లె	295	జులై15	రూ. 57
రాయచోటి	55	ఆగస్టు 01	రూ.75
రైల్వేకోడూరు	63	ఆగస్టు15	రూ.85
రాజంపేట	65	సెప్టెంబర్01	రూ.15

వర్షాలకు దెబ్బతిన్నతోటలు... గిట్టుబాటు కాని ధరలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో మార్కెట్లో పూలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని రైతులు వాపోతున్నారు. 35 కిలోల పూల బస్తా బెంగళూరుకు తరలించాలంటే రూ. 250 వరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధర రూ.15 పలుకుతోంది. ఈ లెక్కన ఒక బస్తా పూలకు రూ.525 మాత్రమే ఒక్కోసారి గిట్టుబాటు లభిస్తుంది. అంతదూరం మార్కెట్‌కు తీసుకెళ్లినా బస్తాపైనా రూ.275 మాత్రమే రైతుకు గిట్టుబాటు అవుతోంది. దీంతో పూలను మార్కెట్లకు తరలించినా ప్రయోజనం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధరలు పడిపోయాయి



ప్రస్తుతం మార్కెట్లో పూల ధరలు పడిపోయాయి. రోజురోజుకు పూల ధరలు పెరుగుతాయనే ఆశలు సన్నగిల్లుతున్నాయి. 15 రోజుల క్రితం కిలో పూల ధర రూ.85 వరకు ఉండేది. ఇప్పుడు అష్టకష్టాలు పడి మార్కెట్‌కు పూలను తరలించినా అంతంత మాత్రంగానే ఆదాయం వస్తోంది. 35 కిలోల బస్తాకు కనీసం రూ. 300 కూడా మిగలడంలేదు. రానున్న పండుగ రోజుల్లో ధరలు పెరగవచ్చని వ్యాపారులు అంటున్నారు. – రెడ్డెప్ప, పూలరైతు,మొరంపల్లె

వర్షాలతో పెట్టుబడి నష్టపోయాం



రెండు ఎకరాల్లో పూల తోటలు సాగు చేశాను. వరుసగా కురుస్తున్న వర్షాలతో పూలతోటలు దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు నాకు రూ. 3 లక్షలు ఖర్చు వచ్చింది. వర్షాలకు దెబ్బతిన్న పూలకు మార్కెట్లో డిమాండ్ లేదు. ఇప్పుడు మార్కెట్లో పూల ధర రూ.15 పలుకుతోంది. దీంతో మార్కెటకు పూలు తరలించినా నష్టపోతున్నాము. గత ఏడాది ఇదే సీజన్‌లో వ్యాపారులు తోటల వద్దకే వచ్చి పూలను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఎవరూ రావడం లేదు. – రమణమ్మ, పూలరైతు, కొత్తపల్లె

క్లుప్తంగా

చేనేత కార్మికుడి దుర్మరణం


మృతి చెందిన సురేంద్ర

బి.కొత్తకోట : వ్యక్తిగత పనులు చూసుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో చేనేత కార్మికుడు దుర్మరణం పాలయ్యారు. హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర నాయక్ కథనం మేరకు.. మదనపల్లి పట్టణం అనపగుట్టకు చెందిన కార్మికుడు సురేంద్ర(40), నాగరాజు రెడ్డి(38) వ్యక్తిగత పనుల నిమిత్తం బి.కొత్తకోట మండలం గట్టు గ్రామంలోని తరిగోడకు వచ్చారు. పనులు చూసుకుని తిరిగి బైక్‌పై మదనపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలో మండలంలోని కోటావూరు గ్రామం అమర నారాయణపురం వద్ద ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఉమశ్రీ, రాజు బాధితులను మదనపల్లి ఆసుపత్రికి తరలించేలోగా తీవ్రంగా గాయపడిన సురేంద్ర మృతి చెందారు. నాగరాజురెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. మృతుడు సురేంద్ర భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తు లేని వాహనంతో ఆ వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



మదనపల్లె : ప్రేమ వివాహం చేసుకున్న తమకు కుటుంబసభ్యుల నుంచి రక్షణ కల్పించాలని ప్రేమజంట మంగళవారం తాలూకా పోలీసులను ఆశ్రయించింది. మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ వెంకటన్నగారిపల్లెకు చెందిన చిన్న నరసింహులు కుమారుడు ప్రకాష్(25), పెద్దమండ్యం మండలం వెంగంవారిపల్లెకు చెందిన శివరామప్పనాయుడు కుమార్తె ధనలక్ష్మి(24)కి రెండేళ్ల కిందట పెద్దలు పెళ్లి చూపులు నిర్వహించారు. అనంతరం వివిధ కారణాలు చూపుతూ వివాహం చేసేందుకు కాలయాపన చేశారు. దీంతో ప్రకాష్, ధనలక్ష్మి ప్రేమలో పడ్డారు. పెద్దలు తమకు పెళ్లిచేయరని నిశ్చయించుకుని ఆగస్టు 28న మదనపల్లె మండలం చెంబకూరురోడ్డు లాభాల గంగమ్మగుడిలో వివాహం చేసుకున్నారు. అనంతరం బెంగళూరుకు వెళ్లిపోయారు. వీరి ఆచూకీని గుర్తించిన అబ్బాయి తరపు బంధువులు ఇద్దరిని తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దీంతో తామిద్దరం ఇష్టపడి పెళ్లిచేసుకున్నామని, ఇరు కుటుంబాల నుంచి రక్షణ కల్పించాలని సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదుచేశారు.

ఈ గురుకులం మాకొద్దు నాన్నా..

- ఐదో తరగతి విద్యార్థినిపై వేధింపులతో ఉలిక్కిపడిన విద్యార్థినులు
- తమ పిల్లలకు భద్రత లేదని ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు
- సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలించిన సీఐ వెంకటకొండారెడ్డి, సిబ్బంది
- గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, మరో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు



లక్కిరెడ్డిపల్లి అంబేడ్కర్ గురుకుల పాఠశాల


పాఠశాల నుంచి విద్యార్థినులను స్వగ్రామాలకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

లక్కిరెడ్డిపల్లి : అన్నమయ్య జిల్లా గురుకుల పాఠశాలలో విద్యార్థినులపై పాఠశాల ప్రిన్సిపల్ పరిమళ భర్త లైంగిక వేధింపుల పర్వం నేపథ్యంలో విద్యార్థినులు పాఠశాల వీడి ఇంటికి వెళ్తున్నారు. మూడు రోజుల కిందట ఐదో తరగతి విద్యార్థినిపై గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపల్ పరిమళ భర్త బాల సుబ్బయ్య లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన విద్యార్థినులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. పాఠశాలలో ఏ మాత్రం పురుషులకు అనుమతి ఉండదని తెలిసీ ప్రిన్సిపల్ భర్త పాఠశాల ఆవరణలోని తన ఇంట్లోనే ఉంటూ అనుకూలమైన వ్యక్తులను లోపలికి తెచ్చి విద్యార్థినుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చేశారు. తమ పిల్లలకు ఎలాంటి ఇబ్బంది ఉండదనుకున్న తల్లిదండ్రులు ఈ సంఘటనతో ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారు.

బోరున విలపించిన బాలికలు

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలలోని అనేక మండలాల నుంచి బాలికలు లక్కిరెడ్డిపల్లె గురుకుల పాఠశాలలో చేరి.. విద్య అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో జరిగిన సంఘటన రాష్ట్రంలో దావానలంలా వ్యాపించడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు సోమవారం రాత్రే పాఠశాలకు చేరుకొని తమ పిల్లలను చూసి బోరున విలపించారు. నాన్నా.. మాకు ఈ స్కూల్‌లో భద్రత లేదంటూ కొందరు బాలికలు తమ తల్లిదండ్రులను పట్టుకొని రోదిస్తుంటే చూసేవారు చలించిపోయారు.

మంత్రి, కలెక్టర్ ఓదార్పు

రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డితోపాటు సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఆర్డీఓ రంగస్వామి పాఠశాలకు చేరుకొని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. ప్రిన్సిపల్ పరిమళతోపాటు, సెక్యూరిటీ గార్డు నాగలక్ష్మి, లక్ష్మీదేవిలను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ చెప్పినా ఇక్కడ ఉండేది లేదంటూ విద్యార్థులు దుస్తులు, సంచులు సర్దుకొని వారి స్వగ్రామాలకు పయనమయ్యారు. మంగళవారం ఉదయం నుంచి కూడా చెన్నూరు, అట్లూరు, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటవేసుకొని లగేజీ భుజాన పెట్టుకొని పాఠశాల విడిచి వెళ్తుంటే ఏ సంక్రాంతో, దసరా పండుగ సెలవులో వచ్చిన వాతావరణం కనిపించింది. ఏ తల్లిని పలకరించినా పరిస్థితి చక్కబడితే మా పిల్లలను లక్కిరెడ్డిపల్లి గురుకుల పాఠశాలకు తీసుకువస్తాం...లేదంటే ఎక్కడో మా ప్రాంతంలోని ప్రభుత్వ స్కూల్‌లో చదివించుకుంటామంటూ చెప్పి వెళ్లిపోయారు. 18 సంవత్సరాలలో ఏనాడూ ఇంతటి దుర్మార్గమైన చర్య చూడలేదని తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు.

సీసీ ఫుటేజ్‌ల పరిశీలన..

గురుకుల పాఠశాలలోకి ఎవరెవరో వస్తూ పోతూ ఉంటారనే విషయాన్ని వెలికితీసేందుకు సీఐ వెంకట కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబుతో కలిసి పాఠశాలలో సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ప్రిన్సిపల్ భర్త నీతిమాలిన చర్య కారణంగా విద్యార్థినులు భయభ్రాంతులై ఇంటికి వెళ్లిపోవడంతో పాఠశాల నిర్మానుష్యంగా మారింది.

మా పిల్లలకు భద్రత లేదు...



మా పిల్లలకు ఇక్కడ భద్రత లేదు. పరిస్థితి చక్కబడితే మా పిల్లలను ఇక్కడ ఉంచుతాం. చిన్న పిల్లలపై ప్రిన్సిపల్ భర్త ఇలా చేయడంతో మాకు భయం వేస్తోంది. పిల్లలను బాగా చూసుకోవాల్సిన ప్రిన్సిపల్ తన భర్తను లోనికి అనుమతించి బయట నుంచి వచ్చే వారిని లోపలకు పంపిస్తూ ఆడపిల్లలను ఇబ్బందులు పెట్టడం బాధ వేసింది. అందుకే నా కుమార్తెలను ఇక్కడి నుంచి మా ఇంటికి తీసుకెళ్తున్నా.

– చిన్న సుబ్బరాయుడు, అట్లూరు మండలం, 9వతరగతి విద్యార్థిని తండ్రి

బాగా చదువుకుంటారని ఇక్కడ చేర్చాను..



నా పిల్లలు బాగా చదువుకుంటారని గురుకుల పాఠశాలలో చేర్పించాను. ఇక్కడ అన్ని వసతులు ఉన్నాయనే ధైర్యంతో ఇద్దరి పిల్లలను పాఠశాలలో వదిలాను. ఇక్కడికి ప్రతి రోజూ ఎవరో బయట వ్యక్తులు వస్తూ పిల్లలను ఇబ్బంది పెడుతున్నట్లు తెలిసింది. ఇక్కడ ఉంటే నా ఇద్దరి పిల్లల పరిస్థితి కూడా ఏమైపోతుందో అనే భయంతో ఇంటికి తీసుకెళ్తున్నాను. ఉన్నతాధికారులు తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

– తిరువీధుల పురుషోత్తం, లక్కిరెడ్డిపల్లి మండలం, మద్దిరేవుల గ్రామం

కాలికి బొబ్బలు వస్తే ప్రిన్సిపల్ హాస్పిటల్‌కు వెళ్లనివ్వలేదు...



పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ సెలబ్రేషన్ కార్యక్రమంలో ఎర్రటి ఎండలో బలవంతంగా ప్రిన్సిపల్ నాతో డ్యాన్స్ వేయించింది. కాలికి బొబ్బలు వచ్చాయి మేడమ్ నేను డ్యాన్స్ వేయలేను అన్నా వినకుండా డ్యాన్స్ వేయించింది. బొబ్బలు పగిలి నొప్పికి హాస్పిటల్‌కు వెళ్లాలి మేడమ్ అని ప్రిన్సిపల్‌ను ప్రాధేయపడినా వెళ్లనీయలేదు. కాలికి మందు రాసి బ్యాండేజ్ చుట్టారు. ఇప్పటికీ వారమవుతున్నా మానలేదు. ఇలాంటి ప్రిన్సిపల్‌ను ఏనాడూ చూడలేదు.

– బి సుష్మ, సీనియర్ ఇంటర్ విద్యార్థిని, లక్కిరెడ్డిపల్లి గురుకుల పాఠశాల

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

– ఆరు మోటార్ సైకిళ్లు దగ్ధం

కడప అర్బన్: కడప నగరంలోని కో–ఆపరేటివ్ కాలనీలో సీటీ యూనియన్ బ్యాంకు వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు రేగి మోటార్ సైకిళ్లపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆరు మోటార్ సైకిళ్లు దగ్ధమయ్యాయి. మూడు మోటార్ సైకిళ్లు పూర్తిగా, మిగిలిన మూడు పాక్షికంగా మంటల్లో కాలిపోయాయి. కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మంటలను ఫైర్ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. ఐతే మంటలు చెలరేగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలోనే ప్రమాదం తప్పింది. కాలిపోయిన మూడు మోటార్ సైకిళ్లలో రెండు బ్యాంకు ఉద్యోగులవి కాగా, మరొకరితో పాటు, మరో మూడు మోటార్ సైకిళ్లు సమీపంలోని జిమ్‌కు వచ్చే వారివిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కడప ఫైర్ అధికారి బి. బసివిరెడ్డి తెలిపారు. మొత్తం దాదాపు రూ. 5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

స్తంభించిన ట్రాఫిక్



రాజంపేట: కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని రాజంపేట పట్టణ శివారులోని భువనగిరి ఆర్చి వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ సంఘటనతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. స్వల్పంగా ఐచర్ వాహనం దెబ్బతింది. క్లీనర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. పెనుప్రమాదం తప్పింది.

బైక్ ఢీకొని లారీ దగ్ధం

ప్రమాదంలో యువకుడి మృతి



మంటల్లో కాలిపోతున్న లారీ (ఇన్‌సెట్) మహేష్ (ఫైల్)

బి.కొత్తకోట : బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీ సమీపంలో సోమవారం అర్ధరాత్రి దాటాక లారీని బైక్ ఢీకొనడంతో మంటలు వ్యాపించి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పెద్దతిప్పసముద్రం మండలం సాన్నువారి పల్లెకు చెందిన మహేష్(22) స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. సోమవారం రాత్రి సినిమా చూసేందుకు మిత్రులు అంజప్ప, అరవింద్‌తో కలిసి బి.కొత్తకోటకు వచ్చాడు. అనంతరం ఇంటికి వెళ్లేందుకు మహేష్ ఒక బైక్‌లో, అంజప్ప, అరవింద్ మరో బైక్‌లో బయలుదేరారు. ఆలేరు వాగు దాటిన తర్వాత.. మొలకలచెరువు నుంచి బి.కొత్తకోటకు వస్తున్న సిమెంట్ లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో బైక్ పెట్రోల్ ట్యాంకు ఢీకొనడంతో ధ్వంసమై మంటలు వ్యాపించాయి. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. లారీ క్యాబిన్ కాలి బూడిదైంది. మృతుడి అత్త కొలిపి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రామాంజులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుడే.. బిడ్డగా..

మృతుడు మహేష్ తల్లిదండ్రులు శ్రీనివాసులు, రాధాల స్వస్థలం పీలేరు. 15 ఏళ్ల క్రితం అనారోగ్యంతో వారు మృతిచెందారు. దీంతో సాన్నువారిపల్లెకు చెందిన వరలక్ష్మి తన అన్న శ్రీనివాసులు బిడ్డలు రేవంత్, మహేష్‌లను తీసుకొచ్చి పెంచుకుంటోంది. వారిలో మహేష్ మృతిచెందడంతో కుటుంబీకులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తల్లిదండ్రులు కోల్పోయి అత్త వద్ద ఉంటున్న బిడ్డలిద్దరిలో మహేష్ దూరం కావడంతో రేవంత్ ఒక్కడే మిగిలాడు. ఈ విషాద గ్రామస్థులను కలచివేసింది.

ప్రజాస్వామ్య పరిరక్షణకు మూల స్తంభాలు పాత్రికేయులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు పాత్రికేయులు మూల స్తంభాల్లాంటివారని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తోట కళ్యాణ మండపంలో మంగళవారం ఏపీ డబ్ల్యూజే రాజంపేట తాలూకా ప్రథమ మహాసభను ఆ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమం నుంచి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో పాత్రికేయులు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. కరోనా సమయంలో పాత్రికేయులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలను జాగృతపరిచేందుకు విధులు నిర్వర్తించారన్నారు. ఆక్రమంలో అనేక మంది పాత్రికేయులు ప్రాణాలను సైతం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధిలో పాత్రికేయులదే కీలక పాత్ర అని, ఇప్పుడు ఏ ఎన్నికలు లేనందున సమష్టిగా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం శివడ్యాన్స్ అకాడమీ చెందిన చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజె రాష్ట్ర నాయకులు మోపూరి బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బీవీ.నాగిరెడ్డి, చిన్నపత్రికల కమిటీ అధ్యక్షులు చెన్నుపల్లి వెంకటరెడ్డి, శివరామరాజు, చమ్మర్తి జగన్‌మోహన్‌రాజు, మేడా విజయశేఖర్‌రెడ్డి, పోతుగుంట రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఏపీడబ్ల్యూజె రాజంపేట తాలూకా నూతన కమిటీ అధ్యక్షుడిగా ఐసీ.వెంకటరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే గౌరవ అధ్యక్షుడిగా మలిశెట్టి సుబ్బనరసింహులు, గౌరవ సలహాదారుడిగా కళాంజలి అప్పారావు, జవ్వాజి మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా తేజం రవిచంద్రప్రసాద్, చామంచి హరి, రాంబాబు, రామాంజనేయులు, ప్రదీప్, లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా శివశంకర్, కోశాధికారిగా పీ.కార్తీక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నాగేంద్రప్రసాద్, రవికుమార్, ఆదినారాయణ, రాజేంద్ర, శివకుమార్‌నాయుడులతో పాటు మరో పదిహేను మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SPOKEN ENGLISH

■ ఇంగ్లీషు 60 రోజులలో 60 గట్లతో ఆన్‌లైన్ క్లాసులు వాట్సాప్ ద్వారా మీ ఇంటివద్దనే మాట్లాడండి. రేపటి నుండి 5 రోజులు ఫ్రీ క్లాసులకు హాజరుకండి. ప్రామాణిక, గుంటూరు. 9440539029

REAL ESTATE

PLOT FOR SALE

■ కడప నగరంలో పులివెందుల రోడ్డులో కొప్పార్తి ఇండస్ట్రీయల్ హబ్ ఎదురుగా ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు DTCP/AUDA, అప్రూవ్డ్ లేఅవుట్ నందు అన్నీ సౌకర్యాలతో ప్లాటు అమ్మబడును, కొనబడును. సైట్ విజిట్ కొరకు సం.ప్ర: 95024 00350.

SERIVCES

■ ఫింగో ఎంటర్‌ప్రైజెస్ అన్ని రకాల వ్యాపార ప్రాజెక్ట్‌లను అందిస్తుంది వ్యక్తిగత, వ్యవసాయ, విద్య DMA స్వాగతం, జీతం+కమీషన్, © 9266809540.

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647

BUSINESS OFFER

■ కడప జిల్లాలోని ఎర్రగుంట్ల మండలంలో గల మా గార్మెంట్స్ నందు వినాయక చవితి సందర్భంగా గణేష్ ప్రింటెడ్ టీషర్ట్ 80 రూపాయలు. ఆర్డర్ పైన మాత్రమే అమ్ముతున్నాము సంప్ర. ఫోన్: 73868 35720

CHANGE OF NAME

■ I, Shaik Rizwana W/o Shaik Mujeeb R/o D.No.8/242, Bhagath Singh Colony, Gopavaram (G.P.); Proddatur (MA), YSR (Dist); A.P. My Son Name's Wrongly Mastion in her passport (M4041786) Shaik Mohammed Kaif (Old Name) Now Change Her Name As Shaik Mohammad Kaif (New Name)

WANTED

■ ప్రముఖ స్కూల్స్‌లో డ్రిల్ మాస్టర్స్‌గా పనిచేయుటకు అమ్మాయిలు మరియు అబ్బాయిలు కావలెను. అర్హత: డిగ్రీ, PG, NCC, PET ఎదైన వుండాలి. Cont: 9848499240

■ Wanted Male and Female work for MNC Company Qul: 10th to Degree, Sal: 15k to 25k cont: 9502712418 (work from home facility is available)

■ కడప జిల్లాలో గల గ్రామీణ ప్రాంతాల వారికి మా సంస్థలో 26 స్త్రీ/పురుషులకు ఉద్యోగాలు. జీతం: 14వేలు+ DA 6వేలు+రూంఫ్రీ, (నో ఫీజు). అ: 10th–డిగ్రీ (P/F). చెన్నూరు బస్టాండ్ దగ్గర, కడప. ఫోన్ 9502403319.

■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయటానికి కార్గో సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, క్యాబ్ డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 28000 నుంచి 34000 రూము+భోజనం ఫ్రీ. Ph: 9133671684

■ కష్టపడేవ్వి కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. 8317512135.

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి / వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం .జీతం 20K.ఫోన్: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

కువైట్‌లో మహానేతకు ఘన నివాళి


కువైట్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


యుఎస్ఏలో దివంగత సీఎం వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యుఎస్ఏ వైఎస్సార్‌సీపీ యువనేత చిల్లా కిరణ్

కడప కార్పొరేషన్: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కువైట్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి మాట్లాడుతూ మహానేత వై.యస్.రాజశేఖర్‌రెడ్డి లేని లోటు రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని, సూర్య, చంద్రులు ఈ భూమి ఆకాశం ఉన్నంత వరకు ప్రతి తెలుగు వాడి గుండెల్లో వైఎస్సార్ శాశ్వతంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, గల్ఫ్ సలహాదారులు నాయని మహేశ్వర్ రెడ్డి, కువైట్ కో కన్వీనర్ రమణ యాదవ్, మైనార్టీ నాయకులు షేక్ రహమతుల్లా, అప్సర్ అలీ, కమిటీ సభ్యులు పోలి గంగిరెడ్డి, మహబూబ్ బాషా, హనుమంత్ రెడ్డి, బొండ కుమారస్వామి, ఈదా రాజు, బందేలా రమేష్, బాషా, రిజ్వాన్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

జన హృదయాల్లో నిలిచిన మహానేత వైఎస్సార్

– యుఎస్ఏ వైఎస్సార్‌సీపీ యువనేత చిల్లా కిరణ్

రాజంపేట : జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని యూఎస్ఏ వైఎస్సార్‌సీపీ యువనేత చిల్లా కిరణ్ అన్నారు. సెయింట్ లూయిస్‌లో దివంగత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో అభివృద్ధి పుంతలు తొక్కించిన ఏకైక సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా పాలన అందించారని, అందుకే నేటికి ఆయన ప్రజల మనసుల్లో నిలిచిపోయారన్నారు. అనంతరం ఆయన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు


బ్యాటింగ్‌లో రాణించిన బౌలర్ సూర్యతేజారెడ్డి


5 వికెట్లు తీసిన అనంత బౌలర్ దీపక్

కడప స్పోర్ట్స్ : నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు మంగళవారం డ్రాగా ముగిశాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 129 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు 55.3 ఓవర్లలో 223 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిత్ గౌడ్ 57 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్ కనిష్ 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 46 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ జావీద్ 2 వికెట్లు తీశారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టుకు ఆధిక్యం..

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 12 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 32.1 ఓవర్లలో 222 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శేషాద్రి నాయుడు 75, విజయ్‌రామరెడ్డి 45 పరుగులు చేశారు. కడప బౌలర్లు దీపక్ 5, మల్లికార్జున 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 52.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. జట్టులోని మహేంద్రారెడ్డి 69, యోగానంద 66 పరుగులు చేశారు. కడప బౌలర్లు అస్లాం 4, ఆదిల్ హుస్సేన్ 4 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 553 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనంతపురం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

మా వాహనాలకే ఇసుక

- కేటాయించిన రీచ్, స్టాక్ యార్డుల వద్ద కూటమి నేతల దందా
- వేగంగా టిప్పర్ లోడ్‌చేయాలంటే అదనంగా రూ.3 వేలు వసూలు


టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం


రాత్రివేళ ఇటాచీతో టిప్పర్‌లో ఇసుక లోడ్ చేస్తూ..

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఉచిత ఇసుక విధానం ఇసుకాసురులకు వరంగా మారింది. నిబంధనలకు పాతర వేసి చిత్రావతి నదిలో అక్రమార్కుల ఇసుక దందా కొనసాగుతోంది. పగలంతా కూలీలతో మాన్యు వల్‌గా చిత్రావతి నదిలో లోడింగ్ చేస్తున్నారు. ఇసుక రీచ్ నుంచి స్టాక్ పాయింట్ వరకు తరలించే ట్రాక్టర్ల జాబితాను పగలే అధికారులు నోట్ చేస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.200.. కూలీలకు రూ.250 చొప్పున మొత్తం రూ.450 చెల్లిస్తున్నారు. ఇదే అసరాగా తీసుకున్న అధికార పార్టీ నేతలు రోజూ 20 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుక తరలించేస్తున్నారు. కేవలం పది ట్రాక్టర్ల ఇసుక నమోదుచేసి మిగిలినదంతా రాత్రివేళ్ల పక్కదారి పట్టిస్తున్నారు. తొందరగా టిప్పర్ లోడింగ్ కావాలంటే రూ.1000 నుంచి రూ.2వేల వరకు అదనంగా రాబడుతున్నారు. పర్యవేక్షించాల్సిన వారే భాగస్వాములు కావడంతో ఇసుక మాఫియాకు అడ్డుకట్ట లేకుండాపోతోంది.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలంలో ఏటూరు, పెంజి అనంతపురం వద్ద ఏర్పాటుచేసిన స్టాక్ యార్డులను గతంలో ఆగస్టు 25న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పరిశీలించారు. ఎంతవరకు అనుమతులు ఇచ్చామో అక్కడ హద్దులు ఏర్పరచి జెండాలు పాతాలని సూచించారు. సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జేసీతో కలిసి కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశీలించారు. ఇసుక పారదర్శకంగా వినియోగదారులకు ఇవ్వాలని ఆదేశించారు. రీచ్, స్టాక్ పాయింట్ల వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓ, వెలుగు కార్యాలయ సిబ్బందిని నియమించి విధుల్లో భాగస్వాములను చేశారు.

టీడీపీ నేతల వాహనాలకే లోడింగ్

ఏటూరు, పెంజి అనంతపురం ఇసుక స్టాక్ పాయింట్లను గుప్పెట్లో పెట్టుకున్న కొందరు కూటమి ముఖ్య నేతలు రంగంలోకి దిగి విధుల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని తమ దారికి తెచ్చుకుని ఇసుక దందా మొదలెట్టారు. స్టాక్ పాయింట్ల వద్ద ఉంచి.. కూటమి నేతల వాహనాలకు మాత్రమే ఇసుక లోడ్ చేయిస్తున్నారు. సామాన్య ప్రజలు వస్తే గంటలపాటు వేచి ఉండాల్సిందే. తొందరగా కావాలంటే టిప్పర్ లోడ్ చేయడానికి రూ.3 వేలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇసుక అవసరమైన ప్రజలు స్టాక్ పాయింట్ వద్ద క్యూలో ఉన్నా చివరికి కూపన్లు అయిపోయాయి... రేపే లోడింగ్ చేస్తామని చెప్పడంతో టిప్పర్ల డ్రైవర్లు నానా వస్థలు పడుతున్నారు. అక్రమ ఇసుక దందా అరికట్టేందుకు జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

ముద్దనూరు : మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి(50) మంగళవారం ముద్దనూరుకు బైక్‌లో వెళ్తున్నారు. యామవరం సమీపంలోకి రాగానే అదే గ్రామానికి చెందిన కిరణ్ కుమార్‌రెడ్డి స్కూటీలో వచ్చి శ్రీనివాసులురెడ్డి బైక్‌ను ఢీకొన్నాడు .ఈ ఘటనలో శ్రీనివాసులురెడ్డి తలకు తీవ్ర గాయం కాగా, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే క్షతగాత్రుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.